

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

అభివృద్ధి దిశగా అడుగులు

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్

ఎన్నికలకు ముందు అనూహ్యంగా రాజకీయ తెరమీద ప్రత్యక్షమయ్యారు కె.మురళీమోహన్. తన వృత్తి అయిన జర్నలిజాన్ని వీడి పూతలపట్టు నుంచి శాసనసభకు పోటీ చేశారు. తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలిచి అసెంబ్లీకి నడిచారు. అనర్గళంగా మాట్లాడే చాతుర్యం, పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవహరించగల ఒడుపు ఉన్న నాయకుడిగా ఏడాదిలోనే ఎదిగారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను నిరంతరం కలుసుకుంటూ సమస్యలు తెలుసుకుంటూ అసెంబ్లీ వేదికగా పూతలపట్టు వాణిని వినిపిస్తున్నారు. ఎన్నికలకు ముందు పూతలపట్టు నియోజకవర్గ ప్రజలకు మురళి ఇచ్చిన హామీలేమిటి?
వాటి పరిష్కారానికి ఆయన చేసిన కృషి ఎంత? ప్రజలు ఆయన నుంచి ఇంకా ఏమి ఆశిస్తున్నారు? ఎమ్మెల్యేగా రెండో ఏడాదికి ఆయన పెట్టుకున్న లక్ష్యాలు ఏమిటి..
తదితర అంశాల సమాహారం...

- 6వ పేజీలో



క్షణికావేశాలతో భవిష్యత్ నాశనం చేసుకోకండి

జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు లీగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టుల్లో జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి అరుణ సారిక కోరారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. క్షణికావేశాలకు గురై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఐకమత్యంగా ఉండి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్, పలురకాల కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కక్షిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న జిల్లా జడ్జి అరుణ సారిక

5,098 కేసుల పరిష్కారం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 5,098 కేసులు పరిష్కారమయ్యాయి. పీఎల్‌సీఎస్ 140తోపాటు వాయల్పాడులో 41, తిరుపతిలో 2208, తంబళ్లపల్లెలో 96, శ్రీకాళహస్తిలో 267, సత్యవేడులో 188, పుత్తూరులో 34, పుంగనూరులో 60, పీలేరులో 69, పలమనేరులో 202, పాకాలలో 132, నగరిలో 102, మదనపల్లెలో 44, కుప్పంలో 62, చిత్తూరులో 1453 కేసులు పరిష్కారమయ్యాయి.



గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న సీఐ మల్లేష్‌యాదవ్

గంజాయి పెంపకంపై కేసు నమోదు

రామకుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ వెంకటాపురం సమీపంలోని కర్ణాటక సరిహద్దు పొలంలో గంజాయి సాగు చేస్తున్న వైసీపీ మద్దతుదారు కోడెప్పపై కేసు నమోదైంది.కర్ణాటక రాష్ట్రం కేసంబళ్ళ, రామకుప్పం పోలీసుల కథనం మేరకు ...వెంకటాపురానికి చెందిన వెంకట్రామప్పకు గ్రామ సమీపంలోని కర్ణాటక సరిహద్దులో సుమారు రెండెకరాల పొలముంది. వెంకట్రామప్ప కుమారులైన వైసీపీ మద్దతుదారులు మునిరాజు, శంకరప్ప, కోడెప్ప పొలంలోని చిక్కుడు తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని శనివారం ఉదయం రామకుప్పం పోలీసులకు సమాచారం అందింది. సిబ్బందితో కలిసి రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్,ఎస్ఐ వెంకటమోహన్ పొలం వద్దకు చేరుకుని గంజాయి మొక్కలను పరిశీలించారు.అయితే ఆ భూమి కర్ణాటక పరిధిలోనిదని మునిరాజు, శంకర్ చెప్పడంతో పోలీసులు స్థానిక సర్వేయర్, వీఆర్వోలను పిలిపించి సర్వే చేయించారు.ఆ పొలం కర్ణాటక పరిధిలోకి వస్తుందని తేలడంతో స్థానికులు కర్ణాటక సరిహద్దులోని బేతమంగళ పోలీసులకు సమాచారం అందించారు.దీంతో సీఐ రంగశ్యామయ్య, క్యాసంబళ్ళ ఎస్ఐ సంగమేష్ అక్కడకు చేరుకున్నారు. పొలంలో 8గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కోడెప్పపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంగమేష్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు.



పొలంలో ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలు

సంసిద్ధతకు నీళ్లొదిలారు!

బేసిక్స్‌పై విద్యార్థుల్లో అవగాహనకు రూపొందించిన రెడీనెస్ అమలేదీ

చిత్తూరు సెంట్రల్, జూలై5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల్లో ఏదో రాస్తున్నారు... టీచర్లు దిద్ది మార్కులు వేసి పాస్ చేస్తున్నారు.అయితే చాలా మంది 5వ తరగతి పిల్లలు కూడా చిన్నచిన్న వాక్యాలు చదవడం, రాయడం, పదాలు గుర్తించడం రాక ఇబ్బంది పడుతున్నారు.లెక్కల విషయానికి వస్తే కూడికలు, తీసివేతలపై కూడా అవగాహన వుండడం లేదు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై రూపొందించిన నివేదిక ఆధారంగా సగానికిపైగా విద్యార్థులకు కనీసం బేసిక్స్‌పై పట్టులేదని తేలింది. ఇలాంటి పరిస్థితులను మార్చేందుకు విద్యాశాఖ పాఠశాలలు పునఃప్రారంభమైన నాటి నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సంసిద్ధత (రెడీనెస్) కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోంది. బేసిక్స్ మొదలు పై స్థాయి వరకు అన్ని అంశాలూ విద్యార్థులు నేర్చుకుని, గుర్తించుకునేలా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. విద్యార్థులకు వారు చదివే తరగతుల్లో కనీసం అభ్యసన సామర్థ్యాలు, నైపుణ్యాలు నేర్పించడమే దీని లక్ష్యం.

సంసిద్ధత అమలు ఇలా

స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో రెడీనెస్ కార్యక్రమం అమలు చేయాల్సి ఉంది. 50 రోజుల పాటు 6వ తరగతి సిలబస్‌కు అనుగుణంగా కోర్సు రూపొందించారు. 6వ తరగతి విద్యార్థులకు పఠన, అభ్యసన నైపుణ్యాలను టీచర్లు పరిశీలించాల్సి ఉంది. విద్యార్థులచే సాధారణ వాక్యాలు చదివించడం ప్రారంభించి క్రమంగా పేరాలు, పలు ప్రశ్నలకు జవాబులు చెప్పించడం, రాయించడం వంటివి నేర్పించాలి. అన్ని సబ్జెక్టులకు సంబంధించి అక్షరాలు, సాధారణ పదాలు, వాక్యాలు, పదాల ఉచ్చారణ వంటివి చేయించాలి. గణిత నైపుణ్యాలు, సంఖ్యా భావనలు, (స్థాన విలువ, విస్తరించిన రూపం, సంఖ్యా పోలి), చిన్న కూడికలు, తీసివేతల నుంచి రేఖాగణిత ఆకారాలు, కొలత, వైశాల్యం, చుట్టుకొలత, భిన్నాలు వంటి బేసిక్స్ నేర్పించాల్సి ఉంది. ఎన్విరాన్‌మెంటల్ ఆఫ్ స్టడీస్ (ఈవీఎస్), సోషల్ స్టడీస్, సైన్స్ అభ్యసన పరిశీలన కోసం 3-5 తరగతులకు సంబంధించి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడగటం వంటివి చేపట్టాలి. బేసిక్స్ మొదలు పై స్థాయి వరకు అన్ని అంశాలను విద్యార్థులు నేర్చుకునేలా చేయడమే రెడీనెస్ ముఖ్య ఉద్దేశం.



పాఠశాల వాతావరణం అలవాటు చేసుకునేలా

చిన్న పిల్లలు ప్రధానంగా పాఠశాల వాతావరణం అలవాటు చేసుకునేలా సిద్ధం చేయాల్సి ఉంది. ముందు తరగతిలో నేర్చుకున్న అంశాలను, అక్షరాలను, సంఖ్య క్రమాలను ఉపాధ్యాయులు గుర్తు చేయాల్సి ఉంది. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రెగ్యులర్ సిలబస్ కవరేజ్‌తో పాటు భాషా పఠనం, పఠన గ్రహణ కార్యకలాపాలను నిర్వహించాల్సి ఉంది. ఉపాధ్యాయుడు బోర్డుపై కీలక పదజాలం రాసి క్లుప్తంగా వివరించాలి. గ్రూపులుగా, వ్యక్తిగతంగా పఠన కార్యకలాపాలను నిర్వహించాలి. గణిత ఉపాధ్యాయులు నాలుగు ప్రాథమిక కార్యకలాపాలను నిర్వహించాల్సి ఉంది. సంసిద్ధత కార్యాచరణ కింద విద్యార్థులు అర్థం చేసుకునేలా బోర్డుపై రాయడం, విద్యార్థులచే రాయించడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సంసిద్ధత అమలుపై కన్పించని దృష్టి

విద్యార్థుల్లో అభ్యసనా స్థాయిని పెంచడానికి రూపొందించిన సంసిద్ధత కార్యక్రమం జిల్లాలో అమలు కాలేదు. జూన్ 12 నుంచి 30వ తేదీ వరకు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాల్సిన విద్యాశాఖ-సమగ్రశిక్ష అధికారులు అందులో విఫలమయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమై మూడు వారాలు దాటుతున్నా సంసిద్ధత అమలుపై దృష్టి సారించలేదు. ప్రాథమిక పాఠశాలల్లో సంసిద్ధత కార్యక్రమాల అమలు గడువు గత నెల 30వ తేదీతో ముగిసింది. ఎంత మంది విద్యార్థులకు చదవడం, రాయించడం, లెక్కలు నేర్పించడం, గత తరగతుల్లో చదివిన వాటిని గుర్తు చేయించారనేది ప్రశ్నార్థకంగా మారింది.ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులను సంసిద్ధత వైపు నడిపించే అంశాన్ని కూడా పక్కన పెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెంకటరమణ హార్ట్ & మెటర్నిటీ హాస్పిటల్

డి.నెం. 10-3-206/ఎ3/ఎ, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. 0877-2258183, 9490109100

ప్రముఖ గుండె వైద్య నిపుణులు
డా॥ సి.వెంకటరమణ
ఎం.డి.,డి.ఎం.,(కార్డియాలజీ)

* సంపూర్ణ గుండె చికిత్స
* 24 గం॥ ఐసీయు

ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు
డా॥ ఆర్.నిరుపమ
ఎం.బి.బి.ఎస్., డిజిఓ


EHS, WJHS, ALL TYPES OF INSURANCES AVAILABLE APSPDCL

24 గంటలు ఎమర్జెన్సీ, ICU
Cathlab, CTOT, Advanced Surgical OT, Labour Room సౌకర్యం కలదు

మామిడి రైతులకు మద్దతు ధర ఇవ్వాల్సిందే

పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఆదేశం

గుడిపాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఫ్యాక్టరీ యాజమాన్యాలకు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ధరకు మామిడి కాయలను కొనుగోలు చేయాలని చెప్పారు. ఒక్క రూపాయి తగ్గించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. మామిడి రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.



ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద రైతులతో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి, కలెక్టర్ సుమిత్‌కుమార్



రోడ్డుపై నిలిచిన ట్రాక్టర్లు

డబ్బు వసూళ్లపై విచారణ జరిపిన తహసీల్దార్

తాసా, ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీల వద్ద 'ట్రాక్టర్‌కు రూ.20 నుంచి రూ.500 వసూలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై రైతులను శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్ వేర్వేరుగా విచారించారు. నగదు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

రైతులకు రోజువారీ టోకెన్ల పంపిణీ

జిల్లా నలుమూలల నుంచి మండలంలోని మ్యాంగో ఫ్యాక్టరీలకు వస్తున్న మామిడి రైతులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సిబ్బందిని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం డీటీ లక్ష్మి, ఏపీఎం సుధారాణి, వీఆర్వో దీపక్ ఫ్యాక్టరీల వద్ద నిలబెట్టిన ట్రాక్టర్ల వద్దకెళ్లి రైతులకు టోకెన్లను పంపిణీ చేశారు. ఏ రోజుకారోజు టోకెన్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

తమిళనాడుకు మామిడి ఎగుమతులు : కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ర్యాంపుల ద్వారా సేకరించిన మామిడి కాయలను ప్రతి రోజూ ఐదు టన్నుల వరకు తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి ఎగుమతి చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మామిడికి సబ్సిడీ ధర ఇచ్చే అంశంలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు.దీనిపై మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు మామిడికి ఇస్తున్న సబ్సిడీ ధరపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సందేశాలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. రైతుల సమస్యలు తీర్చడానికి జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేస్తోందని తెలియజేశారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

యాదమరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిధులను స్వాహా చేసిన పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీవో సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యాదమరి మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండిన ప్రకాష్ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతా నుంచి తన కుటుంబీకులకు మళ్లించుకున్నాడు. పనులు జరగకుండానే రూ.4,47,325 నిధులను డ్రాచేసి దుర్వినియోగానికి పాల్పడినట్లు డీపీవో తనిఖీల్లో నిర్ధారించారు. ఆ మేరకు నివేదికను కలెక్టర్‌కు పంపడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, తనను సస్పెండ్ చేస్తారని గ్రహించిన ప్రకాష్ మూడ్రోజుల ముందే 45 రోజుల సెలవు పెట్టి వెళ్లిపోయాడు. అయితే ఆయనకు సెలవు మంజూరు చేయడమే ప్రశ్నార్థకంగా ఉంది.

విద్యాశాఖలో ఇద్దరికి పదోన్నతి

చిత్తూరు సెంట్రల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలో ఇద్దరికి పదోన్నతితోపాటు బదిలీ చేసినట్లు డీఈవో వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రెడ్డిశేఖర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై అన్నమయ్య జిల్లా సమగ్రశిక్షకు బదిలీ చేశారు. తిరుపతి జిల్లా ఎంఆర్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వనజకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఇస్తూ తిరుపతిలోని టెక్స్ట్‌బుక్స్ విభాగానికి బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

చెరువు కట్టపైకి వెళుతూ జారిపడి

ఏనుగు మృత్యువాత

కల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టపైకి వెళుతూ జారిపడి నెల క్రితం గున్నకు జన్మనిచ్చిన ఓ ఏనుగు మృతి చెందిన సంఘటన పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలో చోటు చేసుకుంది.పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.కొద్ది రోజులుగా తూర్పు విభాగం అటవీ ప్రాంత సరిహద్దులోని కల్లూరు, పాళెం, దేవళంపేట పంచాయతీల్లో సంచరిస్తున్న ఏనుగులు రెండు రోజుల క్రితం పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకొని పాతపేట పంచాయతీలో పంటలను ధ్వంసం చేస్తున్నాయి.శుక్రవారం రాత్రి గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు పాతపేట సమీపానికి చేరుకున్నాయి. సుబ్రమణ్యం, రామ్మూర్తి, చంద్రశేఖర్, ఖోస్‌భాషాలకు చెందిన వరి, మామిడి పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరు- సదుం రహదారిని దాటుకొని చిట్టారెడ్డిపేట సమీపంలోని పెద్దఒడ్డు చెరువుకట్టకిందకు చేరుకున్నాయి. పూరేడువారిపల్లిలోని రైతు గుర్రప్ప వరిపంటను తొక్కేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన నేపథ్యంలో ఓ తల్లి ఏనుగు చెరువు కట్టపైకి వెళ్లే ప్రయత్నంలో కిందకు జారిపడి మృతి చెందింది. ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు గుర్రప్ప కట్టకింద వెదురుపొద పక్కన నిర్జీవంగా పడి ఉన్న ఏనుగును గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఏనుగు మృతి చెందిందని తెలియడంతో చూసేందుకు పరిసరాల్లోని ప్రజలు తరలివచ్చారు.అటవీశాఖ అధికారులు ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించాక అక్కడే ఎక్స్‌కవేటర్ సాయంతో ఖననం చేశారు.



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో భరణి

రైతులు అప్రమత్తంగా వుండాలి:డీఎఫ్‌వో

చెరువు కట్టపైకి వెళుతూ జారి పడడంతోనే ఏనుగు మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చిత్తూరు డీఎఫ్‌వో భరణి వెల్లడించారు.తిరుపతి జూపార్క్ వైద్యుల ఆధ్వర్యంలో మృతి చెందిన ఏనుగుకు పోస్టుమార్టం నిర్వహించామన్నారు.ఆ ఏనుగు నెల క్రితం ఓ గున్న ఏనుగుకు జన్మనిచ్చిందన్నారు.అధికంగా మామిడికాయలు తిన్న ఏనుగుకు అజీర్తి కారణంగా గ్యాస్ సమస్య తలెత్తిందని, ఊపిరితిత్తులకు గాలి సరఫరా నిలిచిపోయినట్లు పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపారన్నారు.కాగా ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి అడవిలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట ఎఫ్ఆర్‌వో పట్టాభి, డీఆర్వోలు రాకేష్‌కుమార్, కరణ్‌సింగ్, మంగళంపేట సెక్షన్ ఎఫ్ఎస్‌వో మహ్మద్‌షఫీ, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలు రచించిన గేయం

మహారాష్ట్ర తెలుగు పాఠంగా
మన బాలు గేయం




కయ్యూరి బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం రాసిన గేయానికి మహారాష్ట్ర ప్రభుత్వ తెలుగు పాఠ్యాంశంలో చోటు దక్కింది. ఈ సంవత్సరం ఒకటో తరగతి బాలభారతి తెలుగు వాచకంలో బాలు రాసిన సీతాకోకచిలుక గేయాన్ని పాఠ్యాంశంగా ప్రచురించింది. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. తాను రాసిన గేయం మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థులకు పరిచయం చేస్తూ పాఠ్యాంశంగా తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో ముందురోజైన 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. 14, 15 తేదీల్లో సిఫార్సు లేఖలను తీసుకోబోమని స్పష్టం చేసింది. ఆణివారం ఆస్థానం రోజున ఆలయంలోని బంగారు వాకిలిలో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. అలాగే మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తర్వాత శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం' (చిన్నపట్టుగుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యో భవ' అని స్వామిని ఆశీర్వదిస్తారు. తర్వాత అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టీటీడీ తరఫున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడి చేతికి ఇచ్చి, 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,011
తలనీలాలు సమర్పించినవారు: 28,496

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్



2009లో ఏర్పడిన నియోజకవర్గం పూతలపట్టు. 2024లో ఈ నియోజకవర్గం నాలుగవ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు కె.మురళీమోహన్. జర్నలిజం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఈయన తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఒకప్పుడు టీవీ రిపోర్టర్‌గా మైకు చేతబట్టుకుని నాయకుల ముందుకు వెళ్లిన మురళి ముందు ఇప్పుడు అనేక టీవీలు మైకులు పెడుతున్నాయి. సమస్యలను అవగాహన చేసుకునే తత్వం, వేగంగా స్పందించే తీరు, నాయకులతో స్నేహంగా మెలిగే స్వభావం.. ఈయనను అతి తక్కువ కాలంలోనే పరిణతి చెందిన నాయకుడిగా మార్చేశాయి. సంక్లిష్ట రాజకీయ పరిస్థితులుండే పూతలపట్టు నియోజకవర్గంలో అందరితో కలివిడిగా ఉంటూ తొలి ఏడాది ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేశారు మురళీమోహన్. ఈ ఏడాది కాలంలో పూతలపట్టు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇది...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

1 ఏడాదిలో ఏం చేశారు?

రూ.220 కోట్లతో పనుల పరుగులు

- మామిడి రైతులకు అండగా సబ్సిడీ
- కాణిపాకం మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నాం
- తొలి ప్రాధాన్యత కింద గుడియాత్తం రోడ్డు పూర్తి
- ఏనుగుల బెడదపై చర్యలు
- పురోగతిలో పారిశ్రామికవాడ ఏర్పాటు



? ఎమ్మెల్యేగారూ రాగిమానుపెంట రోడ్డు 8ఏళ్లుగా గుంతలమయమైవుంది.16 ఊళ్లకు దీనిమీదే వెళ్లాలి. వాన కురిస్తే మోకాల్లోతు నీళ్లు నిలబడతాయి.ఎన్నికల సమయంలో మీకు ఈ సమస్య గురించి చెప్పుకున్నాం. గెలిచాక ఈ రోడ్డు బాగు చేయిస్తానని చెప్పారు. ఏడాది అయింది. రోడ్డు అలాగే ఉంది. గుర్తు చేస్తున్నా.

- ఖాదర్‌బాషా, ఆటోడ్రైవర్, బంగారుపాళ్యం

! నేనిచ్చిన హామీని మరచిపోలేదు. రాగిమానుపెంట రోడ్డు మరమ్మతు పనులకు రూ.3.50 కోట్లు మంజూరు చేయించా. అయితే ఈ ప్రాంతంలో బెంగుళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు జరుగుతున్నాయి. భారీ వాహనాలు తిరుగుతుండడంతో రోడ్డు దారుణంగా మారింది. రిపేరు చేసినా వెంటనే పాడవుతుంది. అందుకే పనులు ప్రారంభించలేదు. ఖాదర్‌బాషా గారూ మిమ్మల్ని వెంటబెట్టుకుని వెళ్లి మీ సమక్షంలోనే ఈ రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తా.

- మురళీమోహన్, ఎమ్మెల్యే



? నియోజకవర్గంలోని చాలా గ్రామాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్నాయి. తరచూ ఏనుగులు పంటల్ని నాశనం చేస్తున్నాయి. ఈ బెడద లేకుండా చేస్తానని మీరు చెప్పారు. దివిటివారిపల్లె నుంచి చుక్కావారిపల్లె వరకు కందకాలు తవ్వించి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించండి ఎమ్మెల్యే గారూ. యాదమరి మండలంలోని బోడబండ్ల బీట్ నుంచి దళవాయిపల్లె వరకు కూడా కందకాలు అవసరం.

- నీలివెంకటాద్రి, దివిటివారిపల్లె, ఐరాల మండలం
- గిరి యాదవ్, దళవాయిపల్లె, యాదమరి మండలం

! యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో కందకాలు తవ్వేందుకు 20 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. అయితే దివిటివారిపల్లె నుంచి చుక్కావారిపల్లె వరకు సోలార్ కంచె ఏర్పాటు చేయడానికి అవరోధాలున్నాయి. అటవీ శాఖ, రైతుల భూముల మధ్య సమస్య ఉంది. ఈ ప్రాంతంలో వదులు మట్టి ఉండడంవల్ల ఏనుగులు కంచెను లోడేస్తాయి. ప్రత్యామ్నాయంగా అటవీ ఉద్యోగుల సంఖ్య పెంచాం. వనమిత్రలను నియమించి ప్రజలను అప్రమత్తం చేయిస్తున్నాం. ఏనుగు కనిపించిన వెంటనే ట్రాకర్ వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు కూడా వచ్చేశాయి.త్వరలోనే వాటి ద్వారా మదపుటేనుగులను అదుపుచేస్తాం.పంటలతో పాటు రైతులకూ ఇబ్బంది లేకుండా చూస్తాం.

- మురళీమోహన్, ఎమ్మెల్యే



? నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇప్పిస్తానని మీరు చెప్పారు. నాలాంటి చదువుకున్న వాళ్లు చాలామంది ఉపాధి అవకాశాల్లేక కూలి పనులు చేసుకుంటున్నాం సార్.

- మనోజ్‌కుమార్, బైటపల్లె, పూతలపట్టు మండలం

! పూతలపట్టు- పి.కొత్తకోట మధ్యలో వంద ఎకరాల భూమిని సేకరించి ఏపీఐఐసీకి అప్పగించాం. ఇక్కడ మినీ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి మీడియం స్కేల్ ఇండస్ట్రీస్‌ను తీసుకురానున్నాం.

- మురళీమోహన్, ఎమ్మెల్యే



? వైసీపీ ప్రభుత్వం రహదారుల్ని పట్టించుకోక ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. చిత్తూరు-గుడియాత్తం రోడ్డు దారుణంగా ఉంది.ఎందరో ప్రమాదాలకు గురయ్యారు. నా వెన్నెపూస దెబ్బతిని తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నా. నియోజకవర్గంలోని చాలా రోడ్ల పరిస్థితి ఇదే. మీరైనా పట్టించుకోండి ఎమ్మెల్యేగారూ.

- వినాయకం, పట్రపల్లె, యాదమరి మండలం

! గుడియాత్తం రోడ్డు గెలిచాక నా తొలి ప్రాధాన్యమని చెప్పా.ఆ మాటకు కట్టుబడి ఆ రోడ్డును బాగు చేయించా. 6 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులు, రూ.3 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో దాన్ని పూర్తి చేశాం. మిగిలిన రోడ్లు కూడా ఒకటొకటీ బాగవుతున్నాయి.

- మురళీమోహన్, ఎమ్మెల్యే

తొలి ఏడాది ఇవి చేశాం...

- మామిడి రైతుల సమస్యను అసెంబ్లీలో మాట్లాడి, సబ్సిడీ ధర కోసం పోరాడి సాధించుకున్నాం. నేను, ఎంపీదగ్గుమళ్ల ఒత్తిడితో కేంద్రంలో మామిడి బోర్డు ఏర్పాటు ఫైల్ కదిలింది. యూపీ/ఏపీ.. ఈ రెండింటిలో ఓ చోట బోర్డును ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.
- కాణిపాకం మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం వచ్చింది. ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ కాణిపాకం వచ్చి పరిశీలించి వెళ్లారు. ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును వంద మీటర్లు జరిపి కొత్తది నిర్మించనున్నాం. త్వరలో పనులు చేపడుతాం.
- తవణంపల్లె మండలం ఏ.గొల్లపల్లె దళితవాడలో పాతికేళ్లుగా నివాసముంటున్న 47 మంది పేదలకు ఇంటిపట్టాలు పంపిణీ చేశాం.
- యాదమరి మండలం పట్రపల్లె దళితవాడలో దశాబ్దాలుగా శ్మశానవాటిక లేదు. 50 సెంట్ల స్థలం కేటాయించి శ్మశాన వాటిక ఏర్పాటు చేశాం.

రెండో ఏడాది లక్ష్యాలు

- పాలారు నుంచి బంగారుపాళ్యం మీదుగా వృథాగా వెళ్తున్న సముద్ర జలాలను బంగారుపాళ్యం మండలం కీరమందలో ప్రాజెక్టు నిర్మించి ఆ నీటిని స్టోర్ చేస్తాం. తవణంపల్లె, బంగారుపాళ్యం, యాదమరి మండలాలకు నీటి సమస్యను తీరుస్తాం.
- ఆరు వరుసల తిరుపతి నేషనల్ హైవే నుంచి కాణిపాకం వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తాను.
- నియోజకవర్గంలో జీవనదులు లేకపోవడంతో కనీసం రెండు రిజర్వాయర్లు నిర్మిస్తాను.



ఆంధ్రా తమిళనాడు సరిహద్దు వద్ద కన్నికాపురం రోడ్డు వేయకముందు



ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధి

శాఖ	పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో
పంచాయతీరాజ్	477	35.01
పీఐయూ రోడ్లు	24	47.52
ఆర్‌అండ్‌బీ	52	11.43
హౌసింగ్	3577	64.88
డ్వామా(ఉపాధిహామీ)	9766	35.95
గ్రామ పంచాయత్	553	6.19
మండల పరిషత్	124	3.22
జడ్పీ	54	2.49
ఎస్ఎస్ఏ	2967	11.03

(ఈ పనులతో పాటు మరిన్ని పనులు కలిపి మొత్తం రూ.220.32 కోట్లతో మంజూరయ్యాయి. రూ.122 కోట్ల పనులు పూర్తవగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.)

నేడు ప్రపంచ జూనోసిస్ డే



ప్రేమ సరే.. జాగ్రత్త సుమా..!

జంతువుల నుంచి వ్యాధులు సోకే ప్రమాదం ● టీకాలు వేయించడంలో అలసత్వం వద్దు

జంతువుల మీద చాలామందికి మక్కువ ఉంటుంది. ప్రేమతో దగ్గరకు చేరదీసి పెంచుతుంటారు. కాలక్షేపం..కాపలా..ఆత్మీయత.. ఒంటరితనం..హోదా...కారణమేదైనా జీవన గమనంలో ఈ మిత్రజీవుల ప్రాధాన్యం పెరిగింది. ఆధునిక సమాజంలో ఇంట్లో ఓ పెంపుడు జంతువు సాధారణమైంది. ఈ జాబితాలో శునకాలదే సింహభాగం. అవగాహనతో వీటిని సాకకపోతే కొన్ని వ్యాధులు సంక్రమించే అవకాశముందని వెటర్నరీ వైద్య నిపుణులు చెబుతున్నారు. జంతువులు, పక్షుల నుంచి మనుషులకు..మన నుంచి పక్షులు, జంతువులకు 150 రకాల హానికర వ్యాధులు(జూనోసిస్) సంక్రమించే ప్రమాదముంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

వ్యాధులెలా సంక్రమిస్తాయంటే..

జంతువులు కరిచినా, సరిగా ఉడకని మాంసం, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు తిన్నా జూనోసిస్ వ్యాధులు సోకుతాయి. సాధారణ జ్వర లక్షణాలతో మొదలై.. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే ప్రమాదమూ ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేబిస్, లెప్టోస్పైరా, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నిపా, టీబీ, బర్డ్‌ఫ్లూ తదితరాలు. పశువులు, పందులు, ఎలుకలు, వీధి కుక్కల నుంచి ఈ వ్యాధులు వ్యాపిస్తాయి. బ్యాక్టీరియా, పరాన్నజీవులు, వైరస్‌ల ద్వారా సంక్రమిస్తాయి.

రేబిస్‌తో ప్రాణాలకు ముప్పు


ఎక్కువ మంది ఇళ్లలో కుక్కలను పెంచుతుంటారు. రేబిస్ సోకిన కుక్క లాలాజలం నుంచి మనుషులకు ఆ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన మొదటిదశలో జ్వరం, తలనొప్పి, దురద, అనారోగ్యం, ఉద్రేకం, నోటి నుంచి చొంగకారడం, కళ్లల్లో నీరుకారడం, మింగలేకపోవడం, మూర్ఛ తదితర లక్షణాలు కనిపిస్తాయి. రెండో దశలో అపస్మారక స్థితికి చేరుకుని ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుంది. మనుషులు, జంతువులను పిచ్చికుక్క కరిచిన వెంటనే గాయాన్ని కార్బాలిక్ సోపు లేదా సబ్బుతో కనీసం పదిసార్లు శుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి. కుక్క కరచిన రోజు నుంచి బాధితుడికి 28రోజుల్లో 5సార్లు టీకాలు వేయించాలి. తర్వాత ఏడాదికోసారి వేయించాలి. 3నెలలు పైబడిన కుక్కలకు టీకాలు తప్పనిసరి. తర్వాత ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.

జ్వర లక్షణాలుంటే సంప్రదించండి



నగరాల్లో ఎక్కువమంది కుక్కలను పెంచుకుంటున్నారు. ఆరోగ్యవంతమైన వాటినే కొనుగోలు చేయాలి. మనం తినే ప్రతీది దానికి పెట్టకూడదు. వైద్యులను సంప్రదించి ఆహారం పెట్టాలి. వీటికి కూడా కిడ్నీ, మధుమేహం తదితర సమస్యలు ఉంటాయి. పరిశుభ్రంగా ఉంచాలి. రెండు రోజులపాటు తీవ్రమైన జ్వర లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయాలి. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో కుక్కలు, ఇతర జంతువులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైతే వైద్యచికిత్స చేస్తున్నాం. ఆస్పత్రిలో స్కానింగ్ లాంటివి కూడా ఉన్నాయి.

- వి.వైకుంఠరావు, వీసీసీహెడ్, ఎస్వీ వెటర్నరీ కళాశాల



నేడు ఉచిత వ్యాక్సిన్ క్యాంపు

తిరుపతి తాతయ్యగుంట వెటర్నరీ కళాశాలలోని నగర పశువైద్య ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9 గంటలకు పెంపుడు జంతువులకు(కుక్కలు, పిల్లులు) ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నారు. దీన్ని జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని రాలేని వారు సోమ, మంగళవారాల్లో కూడా వచ్చి వ్యాక్సినేషన్ వేయించుకోవచ్చునని సూచించారు.

- పి.జగపతిరామయ్య, అసోసియేట్ డీన్

రేపటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్

18 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ● ఎస్వీ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్

తిరుపతి(విద్య), జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, అగికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు(ఈఏపీసెట్) సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 16వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 17 వరకు దరఖాస్తుల వెరిఫికేషన్ జరుగనుంది. 10 నుంచి 18వ తేదీ ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మార్పులుంటే 19న మార్చుకునే వీలుంది. 22న సీట్లు కేటాయిస్తారు.

ఈ జాగ్రత్తలు అవసరం

వెబ్ ఆప్షన్ల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యతా క్రమంలో జాబితాను సిద్ధం చేసుకోవాలి. దాని ఆధారంగా ఆప్షన్లు నమోదు చేయాలి. విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనుమానాల నివృత్తికి జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌లో నేరుగా గాని, 94925 26080లో గాని సంప్రదించవచ్చు.

కోడ్‌ల అంశంలో జాగ్రత్త

పలు ఇంజినీరింగ్ కళాశాలల షార్ట్‌ఫాంలు వేరే ఇతర కళాశాలల పేర్లవలే ఉంది. కోరుకున్న కళాశాలలకు కాకుండా మరో కళాశాలకు ఆప్షన్ నమోదయ్యే ప్రమాదముంది. ఉదాహరణకు వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కోడ్ వీఐటీ ఏపీ కాగా... వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కోడ్ వీవీఐటీగా విట్‌ను తలపింపజేస్తుంది. ఇలాంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లు

ఈఏపీ సెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, టెన్త్, ఇంటర్ ఇంటర్ మార్కుల లిస్టులు, ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రిజర్వేషన్ ఆధారిత సర్టిఫికెట్, ఏడు సంవత్సరాల రెసిడెన్స్ సర్టిఫికెట్.

128 గ్రాముల బంగారాన్ని గదిలో మర్చిపోయిన భక్తులు

● తిరిగి భక్తులకు అప్పగించిన టీటీడీ అధికారులు

తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనం కోసం వచ్చి గదిలో మర్చిపోయిన 128 గ్రాముల బంగారు ఆభరణాలను టీటీడీ రిసెప్షన్ అధికారులు తిరిగి భక్తులకు అప్పగించారు.తమిళనాడు రాష్ట్రం మధురై పట్టణానికి చెందిన శివానందన్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. కాస్త్రి వకుళామాత గెస్ట్‌లో 5వ నెంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని శనివారం తిరుగుప్రయాణ హడావుడిలో 128 గ్రాముల బంగారు ఆభరణాలను గదిలోనే మర్చిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన తుకారాం సోమ మందాకర్, వెంకటముని వాటిని గుర్తించి టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశారు. ఆభరణాలు మర్చిపోయామని తిరిగి వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్లు కుమారస్వామి, భాస్కరనాయుడు ఆ ఆభరణాలను తిరిగి శివానందన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తిరిగి అప్పగించిన అధికారులకు, సిబ్బందికి శివానందన్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజాయితీగా బంగారు ఆభరణాలను అప్పగించిన గెస్ట్‌హౌస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.



ట్రేడింగ్ యాప్ పేరుతో మోసం

● రూ.34 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్ యాప్‌నకు ఆకర్షితుడై ఒక ప్రైవేటు ఉద్యోగి రూ.34 లక్షలు పోగొట్టుకున్న ఘటన శనివారం తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తారకరామానగర్‌కు చెందిన వ్యక్తి హైదరాబాదులోని సీసీసీ డిజిటల్ ఇండియా కంపెనీలో టెక్నికల్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 23న అతనికి అమెరికన్ సెంచరీ ఇన్వెస్ట్‌మెంటు పేరుతో వాట్సాప్ కాల్ వచ్చింది. తమ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. కొన్ని లింకులు పంపారు. వాటి ద్వారా అతను రూ.34 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. రూ.1.5 కోట్ల లాభాలు వచ్చాయని, ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసేందుకు ఇంకా రూ.28 లక్షలు చెల్లించాలని కోరారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే 1930కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశాడు. శనివారం తిరుపతి రూరల్ సీఐను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

● ఒకరి మృతి, 15 మందికి గాయాలు

రేణిగుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. అమరరాజా పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులను పిచ్చాటూరు, నారాయణవనం నుంచి శనివారం ఉదయం విధులకు తీసుకొచ్చే క్రమంలో రెండు బస్సులు పోటీపడ్డాయి. మర్రిగుంట సమీపంలోని నారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఒక బస్సు ఢీకొంది. ముందు సీటులో కూర్చుని ఉన్న మహాలక్ష్మి(25) అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ఉన్న 15 మంది ఉద్యోగులు గాయపడ్డారు. పరిశ్రమ నిర్వాహకులు ఘటనా స్థలానికి గాయపడిన వారిని అమరా హాస్పిటల్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో ప్రమాద స్థలికి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందతున్న క్షతగాత్రులను తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి పరామర్శించారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ కుమార్

ఇక ఈ-ఆటోలతో చెత్త సేకరణ!

కుప్పం చేరిన 130 వాహనాలు ● ఈ రాయిస్ వితరణ

కుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంతోపాటు మండలంలోని గ్రామ పంచాయతీలు అప్‌గ్రేడ్ అవుతున్నాయి. ముఖ్యంగా చెత్త సేకరణలో ఆధునిక పద్ధతుల వినియోగం నేర్చుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే చేరిన ఈ ఆటోలతో చెత్త సేకరణకు ఉపక్రమిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 2, 3 తేదీలలో కుప్పం పర్యటన చేసిన విషయం తెలిసిందే. శాంతిపురం మోడల్ స్కూల్ వద్ద 2వ తేదీన నిర్వహించిన ప్రజావేదిక ప్రాంగణంలో ఆయన కడా తరఫున మూడు ప్రసిద్ధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇందులో ఏస్ ఇండస్ట్రీస్, ఈ- రాయిస్, ఎస్వీఎఫ్ సోయా కంపెనీలు ఉన్నాయి. వీటిలో ఈ-రాయిస్ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తుల కంపెనీ. ఎలక్ట్రిక్ ఆటోలు, ఎలక్ట్రిక్ సైకిళ్లతోపాటు పలు రకాలైన వాహనాలను ఈ కంపెనీ ఉత్పత్తి చేసి మార్కెట్ చేస్తుంది. ఈ-రాయిస్ కంపెనీ త్వరలోనే కుప్పంలో ఏర్పాటు చేసి ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ ఈ కంపెనీని కుప్పం తీసుకురావడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇందుకోసం విమానాశ్రయం ఏర్పడనున్న పరిసరాలలో స్థలాన్ని సైతం కేటాయించారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి ఆ కంపెనీతో తన పర్యటనలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు ప్రతిఫలంగా కడాకు 300 ఎలక్ట్రిక్ ఆటోలను ఉచితంగా ఇవ్వడానికి ఈ- రాయిస్ కంపెనీ అంగీకరించింది. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కింద మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ కోసం వీటిని కేటాయించడానికి అంగీకరించింది. ముఖ్యమంత్రి పర్యటన సమయానికే 130 ఆటోలు కుప్పం చేరాయి. ఇందులో 33 ఆటోలను కుప్పం పురపాలక సంఘానికి ఇచ్చారు. నూతన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసిన ఈ ఆటోలను త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నారు. మిగిలిన ఆటోలను నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ఎంపిక చేసిన పంచాయతీలకు పంపారు. త్వరలోనే మిగిలిన ఆటోలు రానున్నాయి. అవి వచ్చిన తర్వాత మిగిలిన పంచాయతీలకు పంపి పారిశుధ్య నిర్వహణకు కేటాయించనున్నారు. ఈ- ఆటోల ద్వారా మున్సిపాలిటీతోపాటు ఆయా పంచాయతీలలో చెత్త సేకరణ చేయడానికి నిర్ణయించారు. ఒక్కోటి రూ.3 లక్షలు విలువ కలిగి ఎలక్ట్రిక్ ఆటోలలో తడి, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా కంపార్టుమెంట్లు ఉన్నాయి. ఇలా సేకరించిన చెత్తను కంపోస్టు యార్డులకు తరలించి, అక్కడ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ సులువయ్యేలా చేయనున్నారు. ఎలక్ట్రిక్ ఆటోల వినియోగంతో డీజిల్ ఖర్చు తగ్గడంతోపాటు కాలుష్య నివారణ మరింత సులువు కానుంది. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా పారిశుధ్య ప్రక్రియ వేగవంతమవుతుందని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కుప్పం మున్సిపాలిటీకి 100 ఎలక్ట్రిక్ ఆటోలు కేటాయించారని, అందులో ఇప్పటికే 33 ఆటోలు తమకు చేరాయని చెప్పారు. ప్రజలు చెత్తను తమ ఇళ్ల వద్దకు వచ్చే ఎలక్ట్రిక్ ఆటోలు, ఇతర వాహనాలకు అందించాలని ఆయన సూచించారు.


కుప్పం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పార్క్ చేసి ఉంచిన ఎలక్ట్రిక్ ఆటోలు

శేష జీవితం ఆనందంగా గడపాలి : ఎస్పీ


సన్మానగ్రహీతలతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన వారంతా శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ కోరారు. శనివారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో రిటైరైన డీఎస్పీ విజయశేఖర్, ఆర్ఎస్ఐ ఫాజులుద్దీన్, ఏఎస్ఐలు గోవిందరాజులు, రవిచంద్రన్, రాజారెడ్డి, గౌరీశంకర్, సుబ్రహ్మణ్యం నాయుడితోపాటు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుబేంద్రన్, హోంగార్డులు శ్రీనివాసులు, యేసయ్య, అలిమేలును సన్మానించారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, సీఐ మహేశ్వర పాల్గొన్నారు.

పీపీగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ


రామకృష్ణను సన్మానిస్తున్న శంకర్ నాయుడు - బాలాజీకి స్వీట్లు తినిపిస్తున్న న్యాయవాదులు

చిత్తూరు లీగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా సీనియర్ న్యాయవాది వి.ఆర్.రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడితోపాటు పలువురు న్యాయవాదులు రామకృష్ణను ఆయన చాంబర్‌లో కలిసి సన్మానించారు.

ఏపీపీగా బాలాజీ

జిల్లా కోర్టు సముదాయ ఆవరణలో ఉన్న 6వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా సీనియర్ న్యాయవాది బాలాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

పంచాయతీల్లో ప్రగతి పురోగతి నివేదిక తయారీపై శిక్షణ

చిత్తూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో జరిగిన అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు.. ఇలా 29 అంశాల పురోగతిపై నివేదిక తయారు చేయాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్లకు దీనిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది పంచాయతీల్లో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనుల వివరాలను సేకరించాలని సీఈవో చెప్పారు. దీనివల్ల ఆ పంచాయతీకి ఇప్పుడు కావాల్సిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. డీపీవో సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయండి : పెద్దిరెడ్డి


వైసీపీ నేతలతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బంగారుపాళ్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 9వ తేదీన బంగారుపాళ్యంలో పర్యటించనున్నారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం తెలిపారు. బంగారుపాళ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు రెండ్రోజుల కిందట హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారన్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వలేమని చెప్పడంతో మాజీ సీఎం.. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన బంగారుపాళ్యంకు చేరుకుంటారని చెప్పారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్ కుమార్, లలితకుమారి, జడ్పీ మాజీ చైర్మన్ ఎంబీ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, నాయకులు దత్తాత్రేయరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ప్రభునాయుడు, కామరాజు, కిషోర్‌కుమార్‌రెడ్డి, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, యాదమరి మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

రేపటినుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎంఏ (తెలుగు, ఇంగ్లిషు, ఎకనమిక్స్, హిస్టరీ, సోషియాలజీ, సోషియల్ వర్క్), ఎమ్మెస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, మ్యాథమెటిక్స్ కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్), ఎంకాం (ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్), ఎంఎల్ఐఎస్సీ (లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్), ఎంబీఏ (బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), డిప్లొమో (ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్వీయూసీడీఈ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడవచ్చునని ఎస్వీయూ దూరవిద్యా డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

రేపటినుంచి ఈసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూలై 5(ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్, బీఫార్మా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ 7వ తేదీ నుంచి ప్రారంభం కానుందని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వై.ద్వారకానాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాలలు, కోర్సులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మామిడి కాయలను కనీస ధరకు కొనుగోలు చేయండి

ప్రాసెసింగ్ యూనిట్ల వారికి ప్రిన్సిపల్ సెక్రటరీ సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న చిరంజీవి చౌదరి

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల వారు రైతుల నుంచి మామిడి కాయలను కనీస ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి ఉమ్మడి జిల్లాలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయని చెప్పారు. చిత్తూరులో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదికలు పంపిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 కోట్ల మొండి బకాయిలను పల్ప్ పరిశ్రమలకు విడుదల చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. మామిడి ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయడానికి సీఎం చంద్రబాబు ఇప్పటికే కేంద్రానికి లేఖరాశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగిందని, ఇంకా 1.70లక్షల మెట్రిక్ టన్నుల కాయలు రావాల్సి ఉందన్నారు. వివిధ కంపెనీల యజమానులు మాట్లాడుతూ పల్ప్‌పై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న 12 శాతం జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని, మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు, ఆలయాల్లో భక్తులకు జ్యూస్‌లను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. సమావేశంలో జేసీ విద్యాధరి, ఎండీ శేఖర్, హార్టికల్చర్ డీడీ మధుసూదన్‌రెడ్డి, పల్ప్ యూనిట్ల యజమానులు పాల్గొన్నారు.



మొహర్రం పండుగ సందర్భంగా మామిడి కాయల ఎగుమతి వ్యాపారులు సొంతూళ్లకు వెళ్లిపోయారు.దీంతో రెండ్రోజులు మామిడి కాయలను తీసుకు రావొద్దని రైతులకు మండీల యజమానులు చెప్పడంతో ఖాళీగా కన్పిస్తున్న చిత్తూరు మండీలు

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టులో జైఆదిత్య, హిమకేష్


జైఆదిత్య, హిమకేష్

తిరుపతి (క్రీడలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న అండర్-15 జూనియర్ నేషనల్స్ ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న రాష్ట్రజట్టులో తిరుపతి నగరానికి చెందిన విద్యార్థులు జైఆదిత్య, హిమకేష్ పేర్లు ఖరారయ్యాయి. ప్రస్తుతం ఎడిఫైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న వీరిరువురు ఫుట్‌బాల్ క్రీడలో ఉత్సాహంగా పాల్గొని ప్రతి మ్యాచ్‌లో విశేష ఆటతీరును ప్రదర్శించేవారు. కోచ్‌ల నుంచి సమగ్ర శిక్షణ పొంది అంచెలంచెలుగా ఎదిగారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి తమ సత్తా చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రాపబుల్స్‌లో వీరి ఆటతీరును పరిశీలించిన సెలక్టర్లు రాష్ట్రజట్టుకు ఎంపిక చేస్తూ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడా ప్రముఖులు, తల్లిదండ్రులు వీరిని అభినందించారు. రాబోవు జూనియర్ నేషనల్స్‌లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఆర్టీసీ టూ డిపో ఎదుట ఉద్యోగుల ధర్నా


నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. చిత్తూరులోని ఆర్టీసీ టూ డిపో ఎదుట ఉద్యోగులు రెండో రోజైన శనివారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ, అరియర్స్ బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. 24నెలల పీఆర్సీ బకాయిలతోపాటు చనిపోయిన, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్‌ను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్రమణి, చక్రవర్తి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

● నిర్మాణ రంగంలో అభివృద్ధికి దోహదపడే అంశాలపై చర్చ
● 12 దేశాల నుంచి 550 మంది ప్రతినిధుల హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, జూలై5(ఆంధ్రజ్యోతి): ఐఐటీ ప్రాంగణంలో ఐసీసీఎంఎస్(ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్) ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. నిర్మాణ రంగంలో స్థిరత్వం, దోహదపడే అంశాలపై చర్చించారు. 12 దేశాల నుంచి 550మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమగ్ర నిర్మాణాలు - పదార్థాల సమన్వయం(సినర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్) అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో 10 ప్లీనరీ ఉపన్యాసాలు, 21 కీలక ప్రసంగాలు, 427 సాంకేతిక పత్రాల ప్రదర్శనలు, 113 పోస్టర్ సెషన్లు నిర్వహించారు. తక్కువ కార్బన్ సిమెంటు, డిజిటల్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, నిర్మాణ ఆరోగ్య నిఘా వంటి ప్రధాన అంశాలపై చర్చ జరిగింది. ముగింపు సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రసంగించారు. ఉత్తమ పత్రాలకు అవార్డులు అందజేశారు. సదస్సు నిర్వాహకురాలు ప్రొఫెసర్ బిజీలీ బాలకృష్ణన్ ఈ సదస్సు ద్వారా స్థిరమైన ఘన నిర్మాణ పదార్థాల అవసరం, డిజిటల్ ఫ్యాబ్రికేషన్ ప్రాముఖ్యం, విధాన రూపకల్పనలో సెక్టార్ల మధ్య సహకారం, యువ పరిశోధకుల పాత్ర వంటి నాలుగు కీలక విషయాలు స్పష్టమయ్యాయని తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ, రామ్‌కో సిమెంట్స్, సికా, లారన్స్ అండ్ టూబ్రో వంటి ప్రాయోజక సంస్థలు ఈ కార్యక్రమ నిర్వహణలో సహకరించాయన్నారు. ముగింపు సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యా వ్యవస్థ బలోపేతానికే 10న పేరెంట్స్, టీచర్స్ సమావేశం

అన్ని యాజమాన్య పాఠశాలల్లో తప్పని సరి ● ప్రజాప్రతిధులు, అధికారులు హాజరుకావాలి


పీటీఎం అమలును వివరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యావ్యవస్థ బలోపేతంలో భాగంగా 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాల(పీటీఎం 2.0)ను విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపు నిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరితో కలిసి మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు సమర్థవంతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. పిల్లలపై టీచర్లతో పాటు తల్లిదండ్రులకూ బాధ్యతలు పెంచే ఉద్దేశంతో చేపట్టే కార్యక్రమంలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.టీచర్లు సక్రమంగా వస్తున్నారా? మధ్యాహ్న భోజనంలో నాణ్యత, శుభ్రత, నీటి సౌకర్యం వుందా తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు.తమ పిల్లల అభ్యసన తీరును టీచర్లను అడిగి తెలుసుకోవాలని సూచించారు.ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను తల్లిదండ్రులకు వివరించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని గుర్తు చేశారు.ఎంపీ మొదలుకుని సర్పంచ్‌ల దాకా ప్రజా ప్రతినిధులు పీటీఎం కార్యక్రమాలకు హాజరు కానున్నారని, వీరితో పాటు అన్ని శాఖలకు సంబంధించి అధికారులు వారికి కేటాయించిన పాఠశాలల్లో హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి ఉందన్నారు.

మోడల్స్ స్కూళ్లలో బోధన సామర్థ్యాల పెంపు

బోధన సామర్థ్యాలు పెంచి, విద్యార్థులను మరింత ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి జిల్లాలో 489 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఏడు నెలల కసరత్తు అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని, వీటితో విద్యార్థులకు కానీ, అటు తల్లిదండ్రులకు కానీ ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. జిల్లాలో కేవలం 15 పాఠశాలల్లో మాత్రమే సమస్యలున్నాయని, వాటిని సైతం త్వరలో పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. మోడల్ స్కూళ్లలో అన్ని రకాల వసతులను రెండు నెలల్లో సమకూర్చనున్నట్లు వివరించారు. తల్లికి వందనం అమలుకు సంబంధించి ఈకేవైసీ లేదని 223 మంది, ఇతర కారణాలతో 898 మంది నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వీటిని పరిశీలిస్తున్నామని చెప్పారు.

విట్నెస్ అధికారి నియామకం రద్దు చేయాలి : యూటీఎఫ్

మెగా పీటీఎంలో విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరం, మణిగండన్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీటీఎంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల మీద మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు ఉండడం, తీసిన ఫొటోలు అప్‌లోడ్ చేయడం, విట్నెస్ (సాక్షి) అధికారుల నియామకం చేపడుతూ సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I,Dhanajaya Kommini S/o Raghava Naidu.K, (Old Name), D.No:1-100, Kammakandriga(V), Gangireddypalli (P), Ramachandrapuram (M), Tirupati Dist.,A.P.-517561. I have changed my Name to KOMMINI DHANANJAYA S/o KOMMINI RAGHAVA NAIDU, (New Name). Henceforth I will be known as KOMMINI DHANANJAYA.
AJT - 1405

TOLET
చిత్తూరు D.I.Road, D.No. 9-201, పాత ప్రేమలా థియేటర్ ఎదురుగా మొదటి అంతస్తులో 1200 చ॥అ॥ల కమర్షియల్ స్థలం బాడుగకు కలదు. సంప్ర: 98499 04479
AJT - 4636

WANTED
Wanted Lady Teachers for U.K.G and Primary Classes for Hindi & English subjects AKSHARA HIGH SCHOOL, TPT Cont: 94900 27704.
AJT - 1407

WANTED
Wanted teachers for Higher class All Subjects and Computers Teacher,Hostel CooK, for a Reputed School in S.N Puram, Tirupati, Attractive Salary, Cell: 92908 98331,70138 81383.
AJT - 1393

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237899

PLOT FOR SALE
తిరుపతి ద్వారకానగర్, OPP. S.V. అగ్రికల్చర్ కాలేజ్ వద్ద 40 అంకణములు (నార్త్ వెస్ట్ కార్నర్) & 120 అంకణములు నార్త్ ఫేస్ అమ్మబడును. సంప్ర: 89703 33399
AJT - X

PLOT FOR SALE
తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు, రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు, సెల్ : 95154 83527
AJT - 1403

FLAT FOR SALE
తిరుపతి ఖాదీ కాలనీ, ప్రకాశం పార్క్ వద్ద, 2 BHK ఫ్లాట్ 3వ ఫ్లోర్, North-East fully furnished flat 1030 sq.ft. very prime location, No Car Parking for Sale. Cont. : 83100 28673, 97400 01894
AJT - 1404

PLOTS FOR SALE
అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సంప్ర: 91145 61456.
AJT - 1394

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాలు నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 239953

PLOT FOR SALE
శ్రీసాయికృప ఎన్‌క్లేవ్, 3BHK తూర్పుముఖం, 1677 చదరపు అడుగులు, రెడ్డి భవనం దగ్గర, తిరుపతి. 2 కార్లు పార్కింగ్ గల ఫ్లాట్ అమ్మబడును. సంప్ర:91821 51036
AJT - 1406

PLOTS FOR SALE
తిరుపతి రేణిగుంట ఇంటర్నేషనల్ Airport తుడా ఫైనల్ అప్రూవ్, సిగ్నేచర్ గార్డెన్స్ ఎదురుగా, ఎలక్ట్రానిక్స్ సిటీ ప్రక్కన, సెమి కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును. నేరుగా సంప్ర: 80967 83848
AJT -1358

వధువు కావలెను
69 తిరుపతి బలిజ ద్వితీయ చురుకైన వ్యక్తికి తగిన సిరిగల అందమైన స్త్రీ వధువుగా కావలెను. ఇష్టమైన వాళ్ళు మాత్రమే సంప్రదించగలరు. డైరెక్ట్: 83338 67884
AJT - 239883

శ్రీ దుర్గాదేవి జ్యోతిష్యాలయం
■ పండిత్. VR శాస్త్రి గారు. మీ సమస్యలకు ఫోన్ ద్వారా పరిష్కారమార్గం చెప్పబడును. స్త్రీ పురుషులకు ఎటువంటి కఠిన సమస్యలు ఉన్న దుర్గాదేవి పూజ హోమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపించబడును. సెల్: 9866296858
AJO-240911

నేపాల్ రైలు యాత్ర
మహాలయ పక్షంలో నేపాల్ (ముక్తినాథ్) తేది. 06-09-25. 12 రో టికె 25,000/- (రైలు, భోజనం, రూం, A/c బస్సు). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-212094

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కంచర్ల రామయ్య సంస్మరణ సభలో కుప్పం నేతలు



కంచర్ల శ్రీకాంత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జగదీశ్‌బాబు, టీడీపీ నాయకులు

కుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కందుకూరులో శనివారం నిర్వహించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి దివంగత కంచర్ల రామయ్య సంస్మరణ సభకు కుప్పం నాయకులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు గీయించిన కంచర్ల రామయ్య చిత్రపటాన్ని ఆయనతో కలిసి జ్ఞాపికగా కంచర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాజశేఖర్, బీఎంకే.రవిచంద్రబాబు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



డీఈఈ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పుంగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలంటూ పుంగనూరు సీపీఐ పట్టణ కార్యదర్శి రామమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాసమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని నేడు స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరిశీలన



తాగునీటి నాణ్యతను పరీక్షిస్తున్న అధికారులు

పెద్దపంజాణి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షిత మంచినీరు అందించడం కోసమే తాగునీటి నాణ్యత పరీక్షల నిర్వహణ చేపడుతున్నామని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. శనివారం మండలంలోని శివాడి, శంకర్రాయలపేట, ముత్తుకూరు గ్రామాల్లో తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం: మెప్మా ఆర్పీలు



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ఆర్పీలు

గంగవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించిన కూటమి ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని పలమనేరు మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆర్పీలు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఆర్పీలు ఎమ్మెల్యేను వారి కార్యాలయంలో కలిసి సత్కరించారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచిపనిని గుర్తించి మహిళలకు రుణాలు సకాలంలో ఇప్పించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా మేనేజర్ బాబా, సీవోలు జగదీష్, హరిప్రియ, కృష్ణకుమారి, ఆర్పీలు జ్యోత్స్న, ధనలక్ష్మి, ప్యారీజాన్, షకీలా, మునెమ్మ, ధనశ్రీ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పుంగనూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని బీజేపీ నాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లోని సమస్యలను మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హరిగోపాల్, బీజేపీ నాయకులు పెద్దమఠం బాబు, శివయ్య, ఆదినారాయణ, రమేశ్, నాగరాజ, వెంకటేశ్, శివ పాల్గొన్నారు.

నల్లగుట్టపల్లె పాఠశాలపై కలెక్టర్‌కు నివేదిక



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో నటరాజరెడ్డి

పుంగనూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్లపల్లె ప్రభుత్వ పాఠశాల మార్పును రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలను తనిఖీ చేసి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి అభిప్రాయాలను సేకరించి నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు ఆయన వివరించారు.

కంచర్ల రామయ్యకు నివాళులు





రామయ్యకు నివాళులర్పిస్తున్న రామకుప్పం నాయకులు, కంచర్ల శ్రీకాంత్‌ను కలిసిన రామకుప్పం టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య సంస్మరణ సభకు రామకుప్పం మండలం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, నాయకులు చిన్నికృష్ణ, కృష్ణానాయక్, విశ్వనాథ్, రామ్మూర్తి, నరసింహులు, రాజన్న, సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జయశంకర్, మనోహర్, జేయి, నందారెడ్డి రామలింగారెడ్డి, నాగభూషణం, వెంకటరమణ, సతీష్, అవినాశ్‌రెడ్డి, నవీన్, భూపతి, సుబ్రి, రాజారాం, భానుమూర్తి, అలివేలుమంగమ్మ, శీన, రమేష్‌రెడ్డి పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

రొంపిచెర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి పంచాయతీలోని బూత్ కమిటీ, యూనిట్ కమిటీ, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. శనివారం రొంపిచెర్ల షాదీమహల్‌లో రొంపిచెర్ల పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, వార్డుమెంబర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు విభేదాలు పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు తెలుసుకొని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, రాజంపేట పార్లమెంట్ మైనారిటీ నాయకులు ఇమ్రాన్‌ఖాన్, షేక్ కరీముల్లా, నాయకులు హయత్‌బాషా, గౌస్‌పీర్‌ఖాన్, రామమూర్తి, శేషాద్రినాయుడు, నాగరాజ, లక్ష్మయ్య, రాధాకృష్ణ, తులసీరాం, కిరణ్, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8న పుంగనూరులో కంటి వైద్యశిబిరం

పుంగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న పుంగనూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ శివ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో పుంగనూరు, మదనపల్లె లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకురావాలని కోరారు.

దానిమ్మగింజల అలంకరణలో వారాహి దేవి



పుంగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వారాహి నవరాత్రుల్లో భాగంగా చివరి రోజైన శనివారం పుంగనూరు ప్రసన్న పార్వతీదేవి ఆలయంలో అర్చకులు వారా హి అమ్మవారిని ప్రత్యేకంగా దానిమ్మ గింజల అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.


ఇంటర్ విద్యార్థులు ఖాతాలు తెరవాలి

పుంగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే ఎస్సీ విద్యార్థులు తల్లికి వందనం కోసం ఖాతాలేని వారు తాపాలా, బ్యాంకుల్లో అకౌంట్లు తెరిస్తే ప్రభుత్వం రూ.15 వేలు వేస్తుందని పుంగనూరు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములు నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్సీ డీఎస్‌డబ్ల్యూవో విక్రమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తల్లికి వందనం పథకం కోసం బ్యాంకుల్లో విద్యార్థి ఖాతాకు సంబంధించి సమస్య లుంటే తపాలాలో సులభంగా ఖాతా తెరచి ప్రయోజనం పొందొచ్చని.. పట్టణంలోని అన్ని జూనియర్ కళాశాలలకు వెళ్లి ప్రిన్సిపాళ్లకు తెలియజేశామన్నారు. ఎస్సీ వసతిగృహాల్లో మెనూ బాగుందని, మంచి ఆహారం ఇస్తున్నామని, ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ విద్యార్థులు సైతం చేరొచ్చని తెలిపారు. హాస్టల్స్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత వార్డెన్, ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు పెన్షనర్ల సమావేశం

గంగవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పెన్షనర్ల సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు సోమచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పెన్షనర్లు హాజరై సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు.

గంగవరం మండల సమావేశం మళ్లీ వాయిదా



ప్రజాప్రతినిధుల రాక కోసం ఎదురుచూస్తున్న అధికారులు

గంగవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సమావేశాన్ని నిర్వహించారు. అయితే సమావేశానికి మొత్తం 16 మంది ఎంపీటీసీలకు గాను గంగవరం-3 ఎంపీటీసీ కేశవులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారులు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు వేచిచూసినా ఎవరూ హాజరుకాక పోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌కుమార్ ప్రకటించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జరిమానా

వి.కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి పలమనేరు జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 24 కేసులు పరిష్కారమైనట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం

వి.కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 'నిలబడుదాం.. నిలదీద్దాం' కార్యక్రమ గోడపత్రికలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు డా.తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, నేతలు గౌస్, ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం



కుప్పం లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రవి తదితరులు



పుంగనూరులో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి ఆరీఫా

కుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం కోర్టు ఆవరణలో శనివారం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రవి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 67 కేసులను పరిష్కరించినట్లు న్యాయ వర్గాలు తెలిపాయి. రూ.2 లక్షలు విలువ కలిగిన సివిల్ కేసులు, రూ.12,940 విలువ కలిగిన 27 క్రిమినల్ కేసులు, రూ.2.14 లక్షలు విలువ కలిగిన 5 బ్యాంకు కేసులు, రూ.38,300 విలువ కలిగిన 37 ఎస్టీసీ పెట్టీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకొని సామరస్య పరిష్కారాలు పొందాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రవి కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, కార్యదర్శి ఉదయకుమార్, ఏపీపీ ప్రశాంతి, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో 61 కేసులకు పరిష్కారం

పుంగనూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కారం చేసినట్లు పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్‌అదాలత్‌లో 19 సివిల్ కేసులు, 42 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.30.44 లక్షల పరిహారాన్ని కక్షిదారులకు సెటిల్ చేసి అవార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవ్యాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవ్యాదులు, కక్షిదారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై అట్రాసిటి కేసు నమోదు

గంగవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పనులకు రాలేదని తాపీమేస్త్రిపై దాడిచేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంగవరం మండలం గోవిందశెట్టిపల్లెకు చెందిన రెడ్డెప్ప చిన్నూరుకు చెందిన సుబ్రహ్మణ్యం వద్ద తాపీమేస్త్రీ పనులు చేసుకునేవాడు. అయితే కొన్నిరోజుల నుంచి పనులు చేయించుకున్నా డబ్బులు చెల్లించకపోవడంతో సుబ్రహ్మణ్యం వద్ద పనులకు వెళ్లకుండా రెడ్డెప్ప ఆగిపోయాడు. దీంతో పెంచుకున్న సుబ్రహ్మణ్యం మరో నలుగురు ఆనందప్ప, మంజునాథ్, నారాయణస్వామి, తేజలను వెంటపెట్టుకొని రెడ్డెప్పపై దాడి చేసి కులంపేరుతో దూషించారు. రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీ

సోమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సోమల వారపు సంతలో శనివారం సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. సోమల బస్టాండ్‌లో కూల్‌డ్రింక్ షాపు యజమాని చాన్‌బాషా సరుకులు కొనుగోలు కోసం సాయంత్రం సంతకు వెళ్లాడు. ఇతడి నుంచి దుండగులు సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా తస్కరించారు. సుమారు రూ. 35 వేలు విలువ చేసే ఫోన్ చోరీ జరిగింది. అలాగే కలకడకు చెందిన రవీంద్ర వారపుసంతలోనే సరుకులు కొనుగోలు చేస్తుండగా రూ. 20 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ చోరీకి గురైంది.

డెంగీ జ్వరాలపై అవగాహన తప్పనిసరి



జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

వి.కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జ్వరాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం వి.కోట పట్టణంలో డెంగీ జ్వరాలపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యశాఖ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటిని నిల్వ ఉంచడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని.. దోమల లార్వాలను నాశనం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులురెడ్డి, వైద్యాధికారిణి మాధవీలత, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి, బాబు, ఈవో శ్రీనాథరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రి డీఎన్‌ఏ'లో ఉత్పత్తుల పరిశీలన



చిరంజీవి చౌదరికి వివరిస్తున్న యజమాని శ్రీనివాసులు నాయుడు

బంగారుపాళ్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న అగ్రి డీఎన్ఏ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ డీహైడ్రేటెడ్ మ్యాంగో క్యూబ్స్, చాక్లెట్, ఉసిరి(ఆమ్లా) ఉత్పత్తులను పరిశీలించారు. ఇవి ఎంతో రుచిగా, నాణ్యంగా ఉన్నాయని నలగాంపల్లె గ్రామానికి చెందిన యూనిట్ యజమాని ఎన్పీ శ్రీనివాసులు నాయుడిని అభినందించారు. గ్రామీణ యువత మామిడి విలువ ఆధారిత ఉత్పత్తులతో ఉపాధి పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి, ఏడీ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నడింపల్లెలో ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు



నడింపల్లెలో అమ్మవారి విద్యుత్ దీపాలంకరణ

సోమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. నడింపల్లెలో కొలువుదీరిన ఎల్లమ్మ దేవత జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఉభయదారులు జీ ఎల్ మోహన్‌కుమార్, జీఎల్ శ్రీదేవి (జిల్లా జడ్జి) తెలిపారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బస్టాండు నుంచి ఆలయం వరకు భారీ విద్యుత్ దీపాలంకరణలు, పచ్చని తోరణాలతో స్వాగత ఏర్పాట్లు చేపట్టారు. మూడురోజుల పాటు ఆలయం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



జాండ్లవారిపల్లెలో కొలువు దీరిన పీర్లు

రొంపిచెర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాండ్లవారిపల్లె పంచాయతీ కస్పాపేటలో మొహర్రం పండుగ సందర్భంగా పీర్ల చావడిలో పీర్లు ముస్తాబు చేసి కొలువుదీర్చారు. శనివారం పీర్లకు గంధం, పూలతో అలంకరించి పూజలు చేసి ఊరేగింపు చేశారు. చక్కెర, బూందీ వంటి పదార్థాలతో చదివింపులు చేయించి పలువురికి పంచిపెట్టారు.

● **సోమల:** సోమల పఠాన్‌వీధిలోని చావడిలో మొహర్రం పండుగ సందర్భంగా శనివారం పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ముస్లింలు ప్రార్థనలు చేసి చదివింపులు చేసి పంచారు. అలాగే మండలంలోని పలు చోట్ల పీర్లను పురవీధుల్లో ఊరేగించారు.

వరసిద్ధుడి సేవలో పరిటాల సునీత



పరిటాల సునీతకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన కుమారుడు శ్రీరామ్‌తో కలిసి శనివారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లకు ఆర్థికసాయం.. అభినందనీయం

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు సీపీ ఆక్వా కల్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆర్థికసాయం చేయడం అభినందనీయమని బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాష, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు అన్నారు. శనివారం బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో వారు ప్రసంగించారు. రూ.12.80లక్షల ఆర్థికసాయం చేయడంతో విద్యార్థులకు కనీస అవసరాలను తీర్చామన్నారు. అనంతరం ఆక్వా సంస్థ ప్రతినిధులను సన్మానించారు. ప్లాంట్ జనరల్ మేనేజర్ శాకం జనశాక్, నిర్వాహకులు గోపీనాథ్, మాధవరావు, అక్రమ్, బాలచంద్రారెడ్డి, ప్రసాద్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సుపరిపాలనలో ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పెద్దపంజాణి: కరసనపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పెద్దపంజాణి మండలం కరసనపల్లెలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయభాస్కరరెడ్డి, ఆనంద, మురహరిరెడ్డి, శ్రీరాములు, సుధాకరరెడ్డి, రోజారెడ్డి, శివాడి నాగరాజ, మణి, చలపతి, గంగప్ప, రుద్రమూర్తినాయుడు, నిరంజన్‌రెడ్డి, మోహనరెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని సోమల టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శనివారం కందూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై కరపత్రాలు పంపిణీ చేశారు. సోమల పంచాయతీలోని గాజుల కాలనీ, చెన్నయ్యగారిపల్లె, సోమలలో జరిగిన కార్యక్రమంలో పీవీ శివశంకర్, మహేంద్రబాబు, జనార్దన్, మణి యాదవ్, రెడ్డి పార్థసారధి, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి.. సంక్షేమ పథకాల అమలుతో ఏడాదిలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, ధనంజయనాయుడు తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

● **పుంగనూరు:** ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే టీడీపీ నాయకులు ఇంటింటా తిరుగుతున్నట్లు పుంగనూరు టీడీపీ నాయకుడు సుహేల్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని 38, 39 పోలింగ్ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల పరిధిలో భీమగానిపల్లె, బోడేవారిపల్లె, రాంనగర్ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, రమణ, వెంకటరమణ, గంగులప్ప, శ్రీనివాసులు, అబ్బాస్, దాదు, ఫయాజ్, అబ్దుల్, హేసాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే మురళీమోహన్


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం),జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కాణిపాకం పంచాయతీ, చిగరపల్లె పంచాయతీ, అగ్రహారపల్లెలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. జడ్పీటీసీ సుచిత్ర, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, మేదరమిట్టమోహన్‌నాయుడు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

● నలుగురు సభ్యులతో గంటలోనే ముగించేశారు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ గీత

చిత్తూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన చిత్తూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన సమావేశం మధ్యాహ్నం 12గంటలకంతా ముగించారు. అధికారులు వచ్చామా.. తాము రాసుకొచ్చింది చదివామా.. వెళ్లామా అన్నట్లు నిర్వహించారు. తొమ్మిది మంది ఎంపీటీసీలుంటే ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు మరో ఇద్దరు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీనివల్ల మండల అభివృద్ధి, సమస్యలపై చర్చకు తావులేకుండా పోయింది. వచ్చిన సభ్యులు కూడా సమస్యలపై నోరుమెదపలేదు. సభ్యుల్లో చాలామందికి సమాచారం లేకపోవడం వల్లే గైర్హాజరైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఇంత గుట్టుచప్పుడు కాకుండా సమావేశం ఎందుకు నిర్వహించారని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీపీ గీత, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ జయప్రకాష్, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బిల్లులు చెల్లించండి

చిత్తూరు సెంట్రల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు తక్షణం బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి మామిడి రైతుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో సంఘ నాయకులు ఆనందనాయుడు, సంజీవరెడ్డి, జనార్ధన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. మామిడి విక్రయాలు చేసి 14 రోజులు గడుస్తున్న తరుణంలో రైతులకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈనెల 22వ తేదీన ప్రపంచ మామిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. సభ్యులు హరిబాబు, ఉమాపతి, మునిరత్నం నాయుడు, మునీశ్వర్‌రెడ్డి, త్యాగరాజరెడ్డి, భారతి, చెంగల్రావు తదితరులు పాల్గొన్నారు.



9న సార్వత్రిక సమ్మె

చిత్తూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో దేశవ్యాప్తంగా ఈనెల 9న సార్వత్రిక సమ్మె జరగనుందని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో యూనియన్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రమాదేవి, గోపీనాథ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'


శెట్టివానత్తంలో కరపత్రాలను పంచుతున్న జయశంకర్ నాయుడు తదితరులు

శ్రీరంగరాజపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శనివారం శెట్టివానత్తంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రవీంద్రరెడ్డి, ఎన్.కుమార్, నరేష్, నిరంజన్‌రెడ్డి, పైనేని మురళి, వేమ నాయుడు, పుల్లూరు బాబు, సిద్దయ్యశెట్టి, ఎల్.బాబు నాయుడు, మునిరత్నంరెడ్డి, రవి, ఢిల్లీ, జయరాజ్, దశరథ, లోకేష్, పవన్, మణి, సోమేశ్వర్‌రెడ్డి, చినబ్బరాజులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వండర్ సైన్స్ షో



చిత్తూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని గాజులపల్లె వద్ద ఉన్న సమంతా స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వండర్ సైన్స్ షో ఆకట్టుకుంది. మూఢనమ్మకాలు వల్ల సమాజంలో అనర్థాలను జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యుగంధర్ తెలియజేశారు. సైన్స్ గొప్పతనాన్ని వివరిస్తూ మ్యాజిక్ షో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చక్రధర్‌నాయుడు, జేవీవీ సభ్యుడు గిరిధర్, ఉపాధ్యాయుడు సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై ప్రజల హర్షం: టీడీపీ నేతలు


కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

పెనుమూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌పై గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నాయకులు తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని శనివారం సీఆర్ కండ్రిగ దళితవాడలో నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు నాయకులు తలారి రెడ్డెప్ప, ఎన్ఎస్‌నాయుడు, భాస్కర్, దుర్గాప్రసాద్, రాజగోపాల్‌నాయుడు, గంగాధరం, గుర్రప్ప, మోహన్, దూర్వాసులు, ఏకాంబరం, శంకర్, సురేంద్ర,హేమాద్రి పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

● సహకార దినోత్సవంలో వక్తలు


నగరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధే సహకార సంఘం ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో సహకార జెండాను ఆవిష్కరించారు. సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసులురెడ్డి, సీఈవో విజయకుమార్‌రెడ్డి, సహకారశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ బాబు, డీసీసీబీ చీఫ్ మేనేజర్ గోమతి, క్యాషియర్ మాబూనీ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో పర్సన్ ఇన్‌చార్జి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఈవో తులసిపిళ్లై, సూపర్‌వైజర్ ఆనంద్, శ్రీధర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, నాయకులు కుమార్‌నాయుడు, తిరుమలరెడ్డి, జవహర్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శ్యామ్‌రాజ్

శ్రీరంగరాజపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా 49.కొత్తపల్లెమిట్ట గ్రామానికి చెందిన పి.శ్యామ్‌రాజ్ నియమితులయ్యారు.

పగలే.. వెన్నెల!


శనివారం ఉదయం 11 గంటలకు వెలుగుతున్న ఫ్లడ్ లైట్లు

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వృధాను అరికట్టాలని ప్రభుత్వం చెబుతున్నా కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల పగలూ రాత్రి అనే తేడా లేకుండా అక్కడక్కడా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. రెండ్రోజులుగా నగరంలోని బ్యాన్స్ హోటల్ సర్కిల్‌లో ఉన్న ఫ్లడ్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వివాదాలకు నిలయంగా 'పీసీఆర్' కళాశాల..!

● రాష్ట్రస్థాయి అధికారులకూ ఫిర్యాదులు


కళాశాల ముందు భాగంలో అడ్డంగా తాడుకట్టిన సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర నడిబొడ్డులో ఉండే పీసీఆర్ ప్రభుత్వ కళాశాల వివాదాలకు నిలయంగా మారుతోంది. ఒకే ప్రాంగణంలో జూనియర్, ఒకేషనల్ కళాశాలలు ఉండటమే దీనికి ప్రధాన కారణమన్న ఆరోపణలొస్తున్నాయి. ఈ రెండు కళాశాలల ప్రిన్సిపాళ్ల మధ్య సమన్వయ లోపంతో వివాదం ముదిరింది. ఇప్పటికే రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారుల వద్దకూ ఫిర్యాదులు వెళ్లాయి.

ఏం జరుగుతోందంటే..: అడ్మిషన్ల ప్రక్రియ నుంచే ఇక్కడ వివాదాలు మొదలవుతున్నాయి. శనివారం కూడా ఒకేషనల్ కళాశాల సిబ్బందిని అడ్డుకోవడానికి జూనియర్ కళాశాల ముందు సిబ్బంది అడ్డుగా తాడుకట్టారు. తమకు అడ్మిషన్లు రాకుండా చేయడానికే తాడు కట్టారని ఒకేషనల్ కళాశాల సిబ్బంది ఆరోపిస్తున్నారు.

అంతా ఇష్టారాజ్యమే..: జూనియర్ కళాశాలకు మద్యం తాగి ఓ అధ్యాపకుడు వస్తుంటారని, ఆయన అనుచరులూ ఇష్టారాజ్యంగా తిరుగుతుంటారని సమాచారం. ఇంకొందరు అధ్యాపకులు నిత్యం బోధనకు డుమ్మా కొట్టి కళాశాల ఆవరణంలో తిరగడం పరిపాటిగా మారింది. మరోవైపు ఒకేషనల్ కళాశాల అధ్యాపకులైతే విద్యార్థులను తమకు అవసరమైన పనులకు వాడుకోవడం సైతం వివాదాస్పదమైంది. ఈ విషయాలపై జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్‌ను వివరణ కోరగా.. ద్విచక్రవాహనాలు, ఇతర వ్యక్తులు లోనికి రాకుండా తాడు కట్టామని చెప్పారు. ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్‌ను వివరణ కోరగా.. తమను జూనియర్ కళాశాల అధికారుల చిన్నచూపు చూడటం, అడ్మిషన్లు రాకుండా అడ్డుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్పందించిన ఇన్‌చార్జి డీఐఈవో

కళాశాలలో జరిగిన పలు అంశాలపై ఇన్‌చార్జి డీఐఈవో దయానందరాజు తీవ్రంగా స్పందించారు. తాడు కట్టడంపై కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్‌ను వివరణ కోరి, వెంటనే దాన్ని తొలగించారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి.. అధ్యాపకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈఅంశంపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

రైతులను పరామర్శించే హక్కు జగన్‌కు లేదు / టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్


సమావేశంలో ప్రసంగిస్తున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులను పరామర్శించే హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నపుడు మామిడి రైతులకు రాయితీ ఇచ్చారా.. అవసరమైన పరికరాలు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు.. మామిడికి టన్నుకు రూ.4వేల సబ్సిడీ ప్రకటిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.8వేలకు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. వైసీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి ర్యాంపుల్లో తక్కువ ధరకే మామిడి కొనుగోలు చేసి, నిందలు మాత్రం ప్రభుత్వంపై వేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న జిల్లాలో అలజడి సృష్టించేందుకే జగన్ వస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు మోహన్‌రాజ్, వెంకటేష్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల రామయ్యకు నివాళి



చిత్తూరు సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి రామయ్య ఇటీవల మృతి చెందారు. శనివారం నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన రామయ్య పెద్దకర్మలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని, నివాళులర్పించారు.

'అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా ఏపీ


బాలగంగనపల్లె దళితవాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిగా దిశగా పయనిస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు. బాలగంగనపల్లె, వింజం పంచాయతీల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల అధ్యక్షుడు స్వామిదాస్ ప్రసంగించారు. నేతలు దేవరాజులు, బాలచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి, వర్రా యువరాజారెడ్డి, గురవారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జమీర్, నరసింహులు, సోమసుందర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, మొగిలిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్ కుమార్, మహేష్, నగికుమార్, టైలర్ రాము, వల్లిసాహెబ్, ఉలగనాథం, జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం

చిత్తూరు సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, 25వ డివిజన్ ఇన్‌చార్జి గుండ్లూరు శంకర్ అన్నారు. 25వ డివిజన్‌లోని బాలాజీ నగర్, 1వ మరాఠి వీధి, గాంధీనగర్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పి.రమేష్, బాలాజి, కుసుమ, సుమిత్ర, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

'అగ్రి డీఎన్‌ఏ'లో ఉత్పత్తుల పరిశీలన


చిరంజీవి చౌదరికి వివరాలు తెలియజేస్తున్న శ్రీనివాసులు నాయుడు

బంగారుపాళ్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న అగ్రి డీఎన్ఏ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ డీహైడ్రేటెడ్ మ్యాంగో క్యూబ్స్, చాక్లెట్, ఉసిరి(ఆమ్లా) ఉత్పత్తులను పరిశీలించారు. ఇవి ఎంతో రుచిగా, నాణ్యంగా ఉన్నాయని నలగాంపల్లె గ్రామానికి చెందిన యూనిట్ యజమాని ఎన్వీ శ్రీనివాసులు నాయుడిని అభినందించారు. గ్రామీణ యువత మామిడి విలువ ఆధారిత ఉత్పత్తులతో ఉపాధి పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'సర్దుబాటు' విద్యుత్ చార్జీలను తగ్గించాలి: సీపీఐ


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నగరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం నగరి విద్యుత్ కార్యాలయం వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. నగరి నియోజకవర్గ సీపీఐ ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ.. గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని కోరారు. నాయకులు రామకృష్ణ, శివ, రామాంజనేయులు, సరస్వతి, బొమ్మక్క, నల్లమ్మ, లక్ష్మీదేవి, లలితమ్మ, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

మామిడి రైతులపై వైసీపీది మొసలి కన్నీరు: టీడీపీ

గంగాధరనెల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులపై వైసీపీది మొసలి కన్నీరు అని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా 'అలుగు' కార్యక్రమం



వెదురుకుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం 'అలుగు' కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ద్రౌపది అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడు, ధర్మరాజస్వామి, ద్రౌపది అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవియాదవ్, ప్రధానకార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు. బంగారమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ హాజరయ్యారు.

ఆకట్టుకున్న కోలాట భజన



శ్రీరంగరాజపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్ట గ్రామంలో శ్రీకృష్ణ మందిరం ఆవరణంలో శనివారం నిర్వహించిన కోలాట భజన ఆకట్టుకుంది. నూతనంగా కోలాటం నేర్చుకున్న భక్తులకు దుస్తులు, గజ్జెలను సర్పంచ్ డి.వి.డిల్లెయ్య వితరణ చేశారు. అనంతరం శ్రీకృష్ణ మహిళ కోలాట బృందం కాణిపాకం ఆలయానికి బయల్దేరింది. నాగమణి, కస్తూరి, గోవర్ధని, హంస, శ్రీనివాసులు, శాంతి, సురేష్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పరిటాల సునీత



ఐరాల(కాణిపాకం), జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన కుమారుడు శ్రీరామ్‌తో కలిసి శనివారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



వెదురుకుప్పం, జూలై5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ఆవరణంలో దుర్యోధన, దుశ్శాశన వధ ఘట్టం అలరించింది. ఆలయ ఆవరణంలో దుర్యోధన, దుశ్శాశన మట్టి బొమ్మలను తీర్చిదిద్దారు. వేషధారులు సన్నివేశాలకు కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. రాత్రి భక్తులకు అన్నదానం జరిగింది.

బీసీ హాస్టళ్లకు ఆర్థికసాయం.. అభినందనీయం


సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు సీపీ ఆక్వా కల్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాషా, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు అన్నారు. శనివారం బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో వారు ప్రసంగించారు. రూ.12.80లక్షల ఆర్థిక సాయం చేయడంతో విద్యార్థులకు కనీస అవసరాలను తీర్చామన్నారు. అనంతరం ఆక్వా సంస్థ ప్రతినిధులను సన్మానించారు. ప్లాంట్ జనరల్ మేనేజర్ శాకం జనశాక్, నిర్వాహకులు గోపీనాథ్, మాధవరావు, అక్రమ్, బాలచంద్రారెడ్డి, ప్రసాద్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



చిత్తూరు సెంట్రల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మాపాక్షి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న హెచ్ఎం రమేష్, స్కూల్ అసిస్టెంట్లు హరినాథ్, మధుసూధన్‌లను శనివారం ఘనంగా సత్కరించారు. అదే విధంగా బదిలీపై తమ పాఠశాలకు వచ్చిన టీచర్లు పద్మజ, శ్రీదేవి, విజయకుమారిలను హెచ్ఎం రవీంద్రరెడ్డి, టీచర్లు సుధాకర్, వరదరాజులు, ఆనంద్, ఉమాదేవి, తదితరులు ఆత్మీయ ఆహ్వానం పలికారు.

న్యాయం చేయాలంటూ రైతు నిరసన


తండ్రితో కలిసి వివరాలు తెలియజేస్తున్న వేలు

నగరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలంటూ నగరి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద ఓ రైతు నిరసన వ్యక్తం చేశాడు. విజయపురం మండలంలోని కోసలనగరం సహకార సంఘంలో రుణం తీసుకుని.. చెల్లించినా తనకు నోడ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని వేలు అనే రైతు వాపోయారు. జాయింట్ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ మేరకు విచారణ అధికారిగా ఉన్న నగరి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి కుమార్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందించారు. తనకు కంటి చూపు లేదని.. తన తండ్రి వృద్ధాప్యంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇన్‌చార్జి సీఈవో రాధ, విశ్రాంతి సీఈవో మురగయ్యలు అర్జీ వాపసు తీసుకుంటే నోడ్యూస్ సర్టిఫికెట్ ఇస్తామన్నారని చెప్పారు. తనకు సర్టిఫికెట్ ఇచ్చాకే అర్జీ వాపసు తీసుకుంటానని ఆ రైతు తెలిపాడు. కాగా, విజయపురం పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్ఐని మాట్లాడుతున్నాను సొసైటీకి వెళ్లి సీఈవో చెప్పినట్లు లెటర్ రాసి.. సంతకం పెట్టండని ఓ కాల్ వచ్చిందన్నాడు. విచారిస్తే అది ఫేక్ కాల్ అని తేలిందన్నారు. ఇలా తనను నానా రకాలుగా వేధిస్తున్నారని.. ఇకనైనా న్యాయం జరిగేలా చూడాలని విన్నవించాడు.

సంక్షిప్తంగా..

పారిశుధ్య పనులపై కేంద్ర బృందం పరిశీలన



యాదమరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలో పారిశుధ్య పనులను కేంద్ర బృందం పరిశీలించింది. శనివారం ఈ బృందంలోని సభ్యులు హేమంత్, రాజేష్‌లు మండలకేంద్రంలోని పీహెచ్‌సీ, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తడి, పొడిచెత్త తొలగింపు విధానం తదితర పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యదర్శి శివరాజ్, డిప్యూటీ ఎంపీడీవో బాలసుందరం, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ

వెదురుకుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీగా ఎంపికైన నల్లవెంగనపల్లెలో శనివారం చెత్త సేకరణ పనులను ఎంపీడీవో పురుషోత్తం తనిఖీ చేశారు. కేవీఎం అగ్రహారంలో ఇంటింటి చెత్త సేకరణపై ఆరా తీశారు. కార్యదర్శి లక్ష్మీనరసింహ, ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

గంగాధరనెల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు తహసీల్దార్ సీకే శ్రీనివాసులును బీజేపీ నేతలు శనివారం సన్మానించారు. ఓబీసీ మోర్చా కార్యవర్గసభ్యుడు సుధాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ప్రధానకార్యదర్శి ఈశ్వర్‌కుమార్‌మురళి, నారాయణఆచారి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ దాణా పంపిణీ

పాలసముద్రం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీ దాణాను శనివారం పాలసముద్రంలో పశు వైద్యురాలు అనిజ పంపిణీ చేశారు. బస్తాను రూ.555కే ఇస్తున్నామని చెప్పారు. తిరుమలరాజుపురం, ఆముదాల, బలిజకండ్రిగ పశువైద్యశాల సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంచామన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, సాంబశివన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు: సీఐ

వెదురుకుప్పం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సీఐ హనుమంతప్ప శనివారం తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా పెట్రోలింగ్ వాహనాలను ఉపయోగిస్తున్నామని చెప్పారు. రోడ్లపై వాహనాల పార్కింగ్, ఇతరత్రా దుకాణాల బోర్డింగ్‌లు పెట్టినా కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పెనుమూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జెట్టిగుండ్లపల్లె వద్ద రెండ్రోజుల కిందట జరిగిన రోడ్డుప్రమాదంపై శనివారం ఎస్ఐ రామచంద్రయ్య కేసు నమోదు చేశారు. ఈశ్వర్‌నాయుడు ట్రాక్టర్ నడుపుతుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంలో కనికాపురం గ్రామానికి చెందిన రమేష్ తన భార్య కస్తూరితో వస్తుండగా ఢీకొన్నాడు. ఈ మేరకు ఈశ్వర్‌నాయుడిపై కేసు నమోదు చేశారు.

బెల్టుషాప్ నిర్వాహకుడి అరెస్టు

శ్రీరంగరాజపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాప్ నిర్వాహకుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో పెద్ద తయ్యూరుకు చెందిన ఎన్.చిన్నబ్బ నిర్వహించే బెల్టు షాపు షాపుపై దాడి చేశారు. 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

చిత్తూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తల్లి, కుమార్తె అదృశ్యంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంటయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరం ఓటి చెరువుకు చెందిన లోకేశ్వరిని పలమనేరు ఆదిత్యనగర్‌కు చెందిన దిలీప్ కిచ్చి వివాహం చేశారు. వీరికి పవిక్షశ్రీ(3) అనే కుమార్తె ఉంది. కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య ఆర్థికలావాదేవీల కారణంగా ఘర్షణ జరుగుతుండేది. ఈ క్రమంలో రెండ్రోజుల కిందట లోకేశ్వరి తన కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. తాను అత్తగారింటికెళితే భార్య, కుమార్తె కనిపించలేదని భర్త దిలీప్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.